సాక్షి
చిత్తూరు
శనివారం । 11 । మార్చి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	19
తిరుపతి	34	18
తిరుమల	29	14
గూడూరు	34	21
నగరి	36	20



ఘనంగా లక్ష కుంకుమార్చన ప్రారంభం

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారి లక్ష కుంకుమార్చన శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం సంప్రోక్షణతో లక్ష కుంకుమార్చన పరిపూర్ణం కానుంది. - II లో

న్యూస్‌రీల్

బోయకొండలో భక్తుల రద్దీ



భక్తులతో కిక్కిరిసిన క్యూ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. రాహుకాల అభిషేక పూజల్లో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక పూజలను పురస్కరించుకు అమ్మవారిని అర్చకులు విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

గుడిపాల: పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బొమ్మసముద్రం ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్నందున పిల్లల ఇంటి వద్దకు వెళ్లి సక్రమంగా చదువుతున్నారా అని తెలుసుకోవాలని సూచించారు. అనంతరం కోటూరు ప్రాథమిక పాఠశాలకు చేరుకుని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు రుక్మిణమ్మ, భానుప్రియ పాల్గొన్నారు.

20న ఉగాది కవితల పోటీలు

చిత్తూరు రూరల్ : ఉగాదిని పురస్కరించుకుని కవితల పోటీలు నిర్వహించనున్నట్లు హరివిల్లు ప్రధాన కార్యదర్శి బాలరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరులోని రెవెన్యూ భవనంలో ఈనెల 20వ తేదీన పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల రచయితలు ఉగాది కవితలను ఈనెల 15వ తేదీ లోపు బాలరాజు, 21-261,362 ఇందిరమ్మకాలనీ, బైపాస్‌రోడ్డు, మురకంబట్టు, చిత్తూరు అనే చిరునామాకు పంపించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలలకు సెలవు

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలున్న విద్యా సంస్థలకు సెలవు ఉంటుందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం ప్రకటించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకుల పంపిణీ చేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా క్షయ నివారణ అధికారి కార్యాలయంలో హెచ్‌ఐవీ, టీబీ, డయాబెటిస్ బాధితులు 70 మందికి సోమవారం రూ.1500 విలువైన నిత్యావసర కిట్‌లు పంపిణీ చేశారు. క్షయ నివారణ అధికారి రవిరాజు మాట్లాడుతూ దాత వాటర్ క్యాన్ రీడ్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఉషాకిరణ్‌ను అభినందించారు. టీబీ, హెచ్‌ఐవీ బాధితులు అధైర్యపడకుండా ఉండాలని, సక్రమంగా పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. పోషకాహార లోపంతో పలువురు వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని, అందుకే దాతల సాయంతో నిత్యావసర సరుకులు అందిస్తున్నామని వెల్లడించారు. వైద్యుల సూచన మేరకు ఆరోగ్య సూత్రాలు పాటించాలని తెలిపారు. ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు రవికుమార్, గుణశేఖర్, సాయి షర్మిల పాల్గొన్నారు.



ఆత్మీయ సభకు తరలివచ్చిన అశేష జనం

చెవిరెడ్డితో చంద్రగిరికి స్వర్ణయుగం



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే చెవిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, పేర్నాటి

- కష్టకాలంలో వెన్నంటి ఉండే వ్యక్తి
- టీడీపీ పాలనంతా ఆయనకు వేధింపులే
- వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి
- నియోజకవర్గ ప్రజల కోసం ఎందాకైనా : ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్/చంద్రగిరి: నియోజకవర్గ ప్రజల కోసం తపించే చెవిరెడ్డి లాంటి నాయకుడు అరుదుగా ఉంటారని, ఆయన ఎమ్మెల్యేగా ఉన్న కాలం అభివృద్ధిలో చంద్రగిరికి స్వర్ణయుగమని వైఎస్సార్ సీపీ లోక్‌సభ పక్షనాయకుడు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కొనియాడారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి సమీపంలోని తొండవాడ వద్ద శుక్రవారం జరిగిన ఆత్మీయ సభ విజయవంతమైంది. ఈ భారీ బహిరంగ సభకు దాదాపు 50 వేల మందికి పైగా తరలిరావడంతో తొండవాడకు వచ్చే దారులన్నీ కిక్కిరిసిపోయాయి. అంతకుముందు తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి సర్కిల్ నుంచి చంద్రగిరి మీదుగా తొండవాడ సభా ప్రాంగణం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మిథున్‌రెడ్డి, చెవిరెడ్డికి క్రేన్ ద్వారా గజమాలతో స్వాగతం పలికారు. సభావేదిక వద్ద ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సభలో ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో రూ.430 కోట్లతో అభివృద్ధిని చేపట్టడం ఓ రికార్డు అన్నారు. కష్టకాలంలో వెన్నంటి ఉండే వ్యక్తి అని, ఆయన అంటే తమకు ఎంతో ఇష్టమన్నారు. గత టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆయనకు అన్నీ కష్టాలేనన్నారు. చెవిరెడ్డి రాక ముందు చంద్రగిరి ఎలా ఉంది, ఆయన వచ్చాక ఎలా ఉందనేది ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు.

పథకాలను ఆపేస్తారంట

విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలను ఆపివేస్తామని లోకేష్ చెప్పడం వారి వెన్నుపోటు సంస్కృతికి నిదర్శనమని ఎంపీ మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే అన్నీ ఆపేస్తామని చెప్పడమే తప్ప ప్రజలకు మేలు చేస్తామని చెప్పే పరిస్థితి లేదన్నారు.

పేర్నాటిని గెలిపించుకుందాం

రానున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో జగన్నకు నమ్మిన బంటు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీ పిలుపునిచ్చారు. పట్టభద్రులందరూ నైపుణ్యత కలిగిన వారని, భవిష్యత్తును చూసి ఓటు వేయాలని కోరారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.



గజమాలతో నేతలకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

నా కుటుంబం ఎంతో..నా ప్రజలు అంతే!



'ప్రజా క్షేత్రంలో ఉండేందుకు ఎంతో ఇష్టపడతా. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను సైతం నా కుటుంబంలాగే భావిస్తా. నేను సంపాదించే ప్రతి రుపాయిలో 75 శాతం ప్రజలకే ఖర్చు చేస్తా'నని ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలోనూ సొంత నిధులతో గడపగడపకు వెళ్లి వారిని ఆదుకున్నట్లు చెప్పారు. రూ.430 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎన్నికల సమయంలో మాటలు చెప్పే వ్యక్తి మీ చెవిరెడ్డి కాదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి పంచాయతీలో ఒక కల్యాణ మండపం, యోగా ధ్యాన మందిరం, కర్మక్రియల భవనం, గ్రామాల్లో సుమారు 250 ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్లను కట్టించానని తెలిపారు. 430 రచ్చబండలు, పోలీసు స్టేషన్, తహసీల్దార్, ఆసుపత్రి, ఎంపీడీఓ కార్యాలయాల్లో రిసెప్షన్‌లు కట్టించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో 1150 సీసీ రోడ్లు, 340 బీటీ రోడ్లు, 115 మెటల్ రోడ్లుతో సుమారు 1,500 రోడ్లు ఒక్క చంద్రగిరిలో వేయించానని చెప్పారు. ఆపద వస్తే పారిపోయే వ్యక్తిని కాదన్నారు. తనపై ఎన్ని విమర్శలు చేసినా వారి విజ్ఞతకే వదిలేస్తానన్నారు.

విమర్శలు పట్టించుకోం.. అభివృద్ధే లక్ష్యం



చంద్రగిరి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కృషిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ మోహిత్‌రెడ్డి తెలిపారు. విమర్శలను పట్టించుకోమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అందించేందుకు జగనన్న సైనికుల్లా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.

పప్పూ.. పోటీకి, చర్చకు సిద్ధమా?

- నీది నాది చిత్తూరు జిల్లానే
- చిత్తూరు డీఎన్‌ఏ, రక్తం నీలో ఉంటే రా?
- ఈనెల 12న తంబళ్లపల్లెలో ఉంటాను
- అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా?
- లోకేష్‌కు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సవాల్!



మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

సాక్షి, తిరుపతి: 'వెన్నుపోటుదారుడు చంద్రబాబు కొడుకా.. తెలుగు రాష్ట్ర ప్రజలు పిలిచే పప్పూ.. చిత్తూరు జిల్లాలో అభివృద్ధిపై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధం. అదేవిధంగా చిత్తూరు జిల్లాలో ఎక్కడైనా పోటీకి సిద్ధం. నీలో చిత్తూరు డీఎన్‌ఏ, రక్తం ఉంటే రా?' అంటూ నారా లోకేష్‌కు పార్లమెంట్ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సవాల్ విసిరారు. తిరుపతిలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి ఎంపీ విలేకరుల సమావేశం నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో పాదయాత్ర చేస్తున్న లోకేష్ ప్రభుత్వంపైనా, తనపైన విమర్శలు చేస్తూ... అభివృద్ధిపై చర్చకు సిద్ధమని పిలుపు ఇవ్వడంపై ఎంపీ మిథున్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. చిన్నాపెద్దా లేకుండా దుర్భాషలాడడం లోకేష్ అలవాటని, చిన్నవాడైనా గౌరవంగా మాట్లాడడం తనకు తల్లిదండ్రులు నేర్పిన సంస్కారమన్నారు. చిత్తూరు జిల్లా అభివృద్ధిపై తాను చర్చకు సిద్ధమని, ఈనెల 12న తంబళ్లపల్లెలోనే ఉంటానని చెప్పారు. పాదయాత్రలో లోకేష్ కూడా తంబళ్లపల్లెలోనే ఉన్నారని, ఆ రోజు ఎప్పుడు ఎక్కడికి పిలిచినా చర్చకు సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో చిత్తూరు జిల్లా నుంచి లోకేష్‌కు ఎక్కడినుంచైనా పోటీచేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. లోకేష్ చిత్తూరు జిల్లా వాడేనని, తాను ఆ జిల్లా వాడేనని దమ్ముంటే.. చిత్తూరు డీఎన్‌ఏ, రక్తం ప్రవహిస్తుంటే పోటీకి సిద్ధమా? అని సవాల్ విసిరారు. జిల్లాలో ఎక్కడ నుంచి పోటీ చేయమని చెప్పినా వైఎస్సార్‌సీపీ నాయకులను ఎలాగైనా ఒప్పించి ఎన్నికల బరిలో నిలబడడానికి తాను సిద్ధమని స్పష్టం చేశారు. అదే లోకేష్ కూడా పోటీకి సిద్ధమా? అని ప్రశ్నించారు. తనపై పోటీచేసి గెలవమని సవాల్ విసిరారు. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో వంగివంగి దండాలు పెట్టి, దుర్భాషలాడి, జనాలను రెచ్చగొట్టారని, ప్రజల తీర్పుతో అసెంబ్లీకి రాకుండా చంద్రబాబు ముఖం చాటేశారని గుర్తుచేశారు. లోకేష్ సమాధానం కోసం వేచి చూస్తానని ఎంపీ మిథున్‌రెడ్డి వెల్లడించారు.

అభివృద్ధిని ఓర్వలేకే ఆరోపణలు



వెంగళరాజుకుప్పం హైస్కూల్‌లో టీచర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంటే ఓర్వలేకే చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. శుక్రవారం ఆముదాల, వెంగళరాజుకుప్పం, పాలసముద్రం, బలిజకండ్రిగ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబుకు ప్రజలకే తగిన బుద్ధి చెబుతారన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, అందుకే ముఖ్యమంత్రి నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. విద్యార్థులకు విద్యాసామగ్రిని సైతం అందిస్తున్నామని వెల్లడించారు. జగనన్న గోరుముద్ద కింద పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం వడ్డిస్తున్నామని చెప్పారు. అమ్మఒడి పథకంతో ఏటా రూ.15వేలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆయన ప్రకటించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పార్టీ మండల కన్వీనర్ తులసి యాదవ్, ఆర్‌బీకే చైర్మన్ పోలయ్య, స్థానిక నాయకులు ఇందిరమ్మ, సుందరాజు, కుట్టి, శ్రీనివాసులు నాయుడు, గోపాల్, షణ్ముఖరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి 13 వరకు వైన్‌షాపులు బంద్

చిత్తూరు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం 4 నుంచి నుంచి ఈనెల 13వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లు, టూరిస్టు క్లబ్‌లను మూసివేస్తున్నట్లు చిత్తూరు ఎక్సైజ్ డిపో మేనేజరు దయాసాగర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

పాఠశాలలకు ఫైర్‌సేఫ్టీ సామగ్రి



పరికరాలు అందిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

శాంతిపురం: మండలంలో నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన 24 పాఠశాలలకు ఫైర్‌సేఫ్టీ సామగ్రిని ఎంఈఓ చంద్రశేఖర్ శుక్రవారం పంపిణీ చేశారు. భద్రతా ప్రమాణాల మేరకు అగ్నిమాపక పరికరాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే సచివాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విద్యార్థులకు అవసరమైన డీ వార్మింగ్ మాత్రలను ఎంపీడీఓ హేమమాలిని, వైద్యాధికారి వంశీ చేతుల మీదుగా ఎంఈఓకు అందించారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

- ముగ్గురికి షోకాజ్ నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇద్దరు టీచర్లను సస్పెన్షన్ చేస్తూ డీఈఓ విజయేంద్రరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరో ముగ్గురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కుప్పం మండలం పోరుమాకులపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించిన ఎస్జీటీ రేఖ, ఐరాల మండలం మద్దిపట్లపల్లె ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ చక్రవర్తి ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరుకావడంతో సస్పెన్షన్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే నగరి మండలంలోని కరకంతపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఎస్జీటీ రవిబాబు సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఐరాల మండలానికి చెందిన కార్తీకరాజు అనే టీచర్ ముందస్తు అనుమతి పొందకుండా విధులకు రాకపోవడంతో షోకాజ్ ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

రాజకీయాల్లో యువత పాత్ర కీలకం



కరపత్రాలు అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

కుప్పం : రాబోయే రోజుల్లో యువతే రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం కుప్పంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గ్రాడ్యుయేట్లను నేరుగా కలిసి వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కరపత్రాలను అందించి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి పాలిటెక్నిక్‌లో ప్రచారం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ యువత పెద్దసంఖ్యలో రాజకీయాల్లోకి రావాల్సిన అవసరముందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

మాన్యువల్ మేరకే కౌంటింగ్

- శిక్షణ తరగతుల్లో జేసీ వెంకటేశ్వర్



కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్

సాక్షి, చిత్తూరు : ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌ను మాన్యువల్ నియమావళి మేరకే పకడ్బందీగా నిర్వహించాలని జేసీ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఆర్‌వీఎస్ కళాశాల ఆడిటోరియంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించనున్న కౌంటింగ్ పర్సనల్స్‌కు రెండో పర్యాయం చేపట్టిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. జేసీ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన ఆర్‌వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్ ఉంటుందని, ఆర్‌వీఎస్ లా కాలేజీలో ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. సిబ్బంది నిష్పక్షపాతంగా కౌంటింగ్ విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం అందించిన మాన్యువల్‌ను పూర్తిగా చదివి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని కోరారు. విశ్రాంత జేసీ చంద్రమౌళి మాట్లాడుతూ కౌంటింగ్ పర్సనల్స్ లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. డమ్మీ కౌంటింగ్ చేయించడం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి, అన్నమయ్య జిల్లాల డీఆర్‌ఓలు శ్రీనివాసరావు, సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓలు రేణుక, సుజన, శివయ్య, మురళి, చంద్రమునిరాణార్, రామారావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న తిరుపతి డీఈఓ శేఖర్

పుత్తూరు రూరల్: పదోతరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తిరుపతి డీఈఓ వి.శేఖర్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని డీవైఈఓ కార్యాలయంలో పది పరీక్షల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ఆరు సబ్జెక్టులకు వంద మార్కుల చొప్పున పరీక్షలు జరుగుతాయన్నారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, డెస్కులతో పాటు తగిన వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థినులను మహిళా ఉపాధ్యాయులే తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. ఆయా సెంటర్ల వద్ద ఆరోగ్య సిబ్బంది, పోలీసు బందోబస్తు తప్పనిసరని తెలిపారు. కార్యక్రమంలో డీవైఈఓ రఘురామయ్య, ఎంఈఓ తిరుమలరాజు, తిరుపతి డీసీసీబీ చైర్మన్ వంశీరాజా విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలు వాయిదా

చిత్తూరు అర్బన్: పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి అర్హత సాధించిన అభ్యర్థులకు 13వ తేదీ నుంచి నిర్వహించాల్సిన దేహదారుఢ్య పరీక్షలు వాయిదా వేసినట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వాయిదా వేశామని, త్వరలోనే మరో తేదీని ప్రకటించనున్నట్లు వివరించారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన ప్రారంభం



సింహ వాహనంపై అమ్మవారు



కుంకుమార్చనలో భక్తులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో తలపెట్టిన అమ్మవారి లక్ష కుంకుమార్చన శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రతి ఏటా మాఘ మాసంలో భక్తుల సౌకర్యార్థం మూడు రోజుల పాటు అమ్మవారి లక్ష కుంకుమార్చన నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో లక్ష కుంకుమార్చనను అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు నాలుగు గ్రూపులుగా అర్చన పూజలో తొలి రోజు సుమారు 550 మంది భక్తులు పాల్గొన్నారు. వారికి అమ్మవారి కుంకుమ, గాజులు, పసుపు దారం, ప్రసాదాలు వితరణ చేశారు. శనివారం ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు విడతల వారీగా పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం సంప్రోక్షణతో లక్ష కుంకుమార్చన పరిసమాప్తం కానుంది. ఇందులో పాల్గొనే వారు రూ.801 చెల్లించి టికెట్ తీసుకోవాలని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శిపై విచారణ



గ్రామ కార్యదర్శి సుబ్బారావును విచారిస్తున్న డీఎల్‌పీఓ వెంకటరమణ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామ కార్యదర్శి ఎస్వీ సుబ్బారావు అవినీతి, అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. గ్రామకార్యదర్శి ప్రభుత్వ సొమ్ము కాజేశాడని గ్రామస్తులతోపాటు మాజీ సర్పంచ్ రమణయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శుక్రవారం గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ, సిబ్బంది భువనేశ్వర్, వంశీ విచారణ చేపట్టారు. సుబ్బారావు అవినీతిపై గ్రామస్తులు, మాజీ సర్పంచ్ నుంచి వివరాలు సేకరించారు. అనంతరం డీఎల్‌పీఓ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామ కార్యదర్శి ఎస్వీ సుబ్బారావు గతంలో వేసిన సీసీరోడ్డు పనికి సంబంధించి రూ.లక్ష 93 వేల 387 కాజేశారని, గ్రీన్ అంబాసిడర్ వద్ద కొంత డబ్బు వసూలు చేశాడని, పంచాయతీకి మంజూరైన ఏకగ్రీవ నిధులు రూ.7 లక్షలు కూడా స్వాహాచేశాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి 2021 జూన్ వరకే రికార్డులున్నాయని, విచారణలో వెలుగు చూసిన వాస్తవాలను కలెక్టరుకు నివేదించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

రాహుకేతు పూజా టికెట్ కౌంటర్లు ప్రారంభం



టికెట్ కౌంటర్లు ప్రారంభిస్తున్న పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన రూ.500, రూ.750 రాహుకేతు పూజ టికెట్ కౌంటర్లను శుక్రవారం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం ఈ కౌంటర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, నాగభూషణంయాదవ్, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్‌లోకి దూసుకెళ్లి ఆగిన కారు

సూళ్లూరుపేట: పట్టణంలోని హోలీక్రాస్ సర్కిల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున షార్ ఉద్యోగులకు చెందిన కారు మలుపు తిరుగుతూ సర్కిల్‌లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారికి ఏమీ కాలేదు. చెన్నై నుంచి వస్తున్న కారును అతివేగంగా మలుపు తిప్పడంతో అదుపు తప్పి సర్కిల్‌కు ఉన్న ఇనుప బారికేడ్‌ను ఢీకొని లోపలికి వెళ్లి ఆగిపోయింది.

సంక్షేమ రథసారథి సీఎం జగన్

- జాతీయ స్థాయిలో గుర్తింపు
- లోకేష్‌ది పాదయాత్ర కాదు విహారయాత్ర



తిరుమల ఆలయం వెలుపల మోపిదేవి వెంకటరమణ

తిరుమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ రథసారథిగా జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ప్రశంసించారు. ఆయన శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. ప్రతి పౌరుడు సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారని తెలిపారు. పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం అయ్యాక అమలు చేసిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. లక్షలాదిమందికి ఉద్యోగావకాశం కల్పించిన వ్యక్తిగా ఆయన జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతున్నారన్నారు. ఉనికి కాపాడుకోవడానికే చంద్రబాబుబాబు తనయుడు లోకేష్ పాదయాత్ర చేపట్టారని విమర్శించారు. లోకేష్‌ది పాదయాత్ర కాదు విహారయాత్ర అని వ్యాఖ్యానించారు. గతంలో చంద్రబాబు పాదయాత్ర చేసి ఏ ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని గుర్తుచేశారు. హామీలన్నీ తుంగలో తొక్కిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. టీడీపీ ఎన్నికల పోరులో దండాలు పెట్టినా.. ఏంచేసినా 2024లో గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదే అని ధీమా వ్యక్తం చేశారు.

ఊపందుకున్న ఆన్‌లైన్ ప్రచారం



ఆన్‌లైన్ ప్రచార మాధ్యమాల లోగోలు

వెంకటగిరి: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఆన్‌లైన్ ప్రచారం హోరెత్తుతోంది. అభ్యర్థులు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల వేదికగా తమకు మొదటి ప్రధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థుల మద్దతుదారులు సైతం ఆన్‌లైన్‌లో పెద్దఎత్తున పోస్టులు పెడుతున్నారు. తూర్పురాయలసీమ పట్టభద్రుల శాసన మండలి స్థానం నుంచి మొత్తం 22 మంది, ఉపాధ్యాయ స్థానం నుంచి 8 మంది బరిలో ఉన్నారు. పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు టీడీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి కంచర్ల శ్రీకాంత్, బీజేపీ పట్టభద్రుల స్థానం నుంచి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి బ్రహ్మానందం, పీడీఎఫ్ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బాబురెడ్డి పొక్కిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా మీగడ వెంకటేశ్వరరెడ్డి బరిలో ఉన్నారు. ఈనెల 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వీరి మద్దతుదారులు ఆన్‌లైన్ వేదికగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఐవీఆర్ఎస్ ద్వారా అభ్యర్థుల వాయిస్‌తో ఓటర్లకు పంపి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు



స్వామినాథన్ (ఫైల్)

చిత్తూరు అర్బన్: నగరంలోని మురకంబట్టు ఇందిరమ్మ కాలనీకి చెందిన స్వామినాథన్ (81) అనే వృద్ధుడి అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాలు.. స్వామినాథన్ జనవరి 31వ తేదిన మురకంబట్టుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబీకులు గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 9440796715 నంబరుకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. నగరంలో గురువారం రాత్రి మణికంఠ ప్రదీప్, వినోద్ అనే యువకులపై కత్తితో దాడిచేసిన ఆనందర్, సాయిరామ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన శేఖర్

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఎం.కొంగరవారిపల్లి వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఐరాలకు చెందిన శేఖర్(39) పశువుల మేత కోసం ఎండి గడ్డిని తీసుకురావడానికి గురువారం రాత్రి ట్రాక్టర్‌లో మరో వ్యక్తి వీరయ్యతో కలిసి శ్రీకాళహస్తికి బయల్దేరాడు. ఎం.కొంగరవారిపల్లి వద్ద వస్తున్న క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ట్రాక్టరు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడడంతో తీవ్ర గాయాలపాలైన శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వీరయ్య క్షేమంగా బయటపడ్డారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

గూడూరు: వెళుతున్న రైల్లోంచి జారి పడిన యువకుడికి గాయపడిన సంఘటన శుక్రవారం మనుబోలు వద్ద జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన భోళా శంకర్ అనే యువకుడు చెన్నైలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతను తన స్వగ్రామానికి వెళ్లే క్రమంలో రైలులో చెన్నై నుంచి ఒడిశా రాష్ట్రానికి బయలుదేరాడు. రైలులో రద్దీ అధికంగా ఉండగా, శంకర్ డోరు వద్ద నిల్చున్నాడు. ఈ క్రమంలో రైలు గూడూరు జంక్షన్ దాటి మనుబోలు మండలం కొందూరు సత్రం సమీపంలో వెళుతుండగా శంకర్ జారి కిందపడిపోయాడు. దీంతో గాయపడిన అతడిని 108 సిబ్బంది గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయితోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుడుపల్లె : మండలంలోని చప్పిడిగరుగుల గ్రామం వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ రియాజ్‌అహ్మద్, ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. శాంతిపురం మండలం మాదనపల్లెకు చెందిన మునివెంకటప్ప కుప్పం నుంచి 10 కిలోల గంజాయిని ప్లాస్టిక్ సంచుల్లో తీసుకెళుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని విచారించగా వైజాగ్‌కు చెందిన ఓ వ్యక్తి గంజాయిని తీసుకువచ్చి కుప్పంలో విక్రయిస్తుంటాడని తెలిపినట్లు వివరించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట టోపీ

- ఇద్దరి అరెస్టు
- రూ.70 లక్షల వరకు పోగొట్టుకున్న బాధితులు

చిత్తూరు అర్బన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి.. రూ.70 లక్షల వరకు కాజేసిన ఇద్దరు నిందితులను చిత్తూరు సీసీఎస్ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. పెద్దపంజాణి మండలంలోని రాయల్‌పేటకు చెందిన జి.అనిల్‌కుమార్‌రెడ్డి (33), బెంగళూరుకు చెందిన శివకుమార్ (26) అనే నిందితులను ఇద్దరిని అరెస్టు చేసి.. కోర్టు ఆదేశాలతో రిమాండుకు తరలించారు. సీసీఎస్ సీఐ భాస్కర్ కథనం మేరకు.. అనిల్‌కుమార్ రెడ్డి, శివకుమార్ ఇద్దరూ స్నేహితులు. రెండేళ్ల క్రితం బెంగళూరులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కన్సల్టెన్సీ పెట్టిన వీళ్లు.. పలువురు నిరుద్యోగులకు వల వేశారు. బీటెక్, డిగ్రీ, ఇంటర్ చదివిన యువకులే లక్ష్యంగా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించారు. పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. తిరుపతి కొర్లగుంటకు చెందిన సాయిశ్రీనివాస్‌కు ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేయడంతో చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డిని ఆశ్రయించాడు. ఎస్పీ ఆదేశాలతో సీసీఎస్ పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితులు అప్పటికే బెంగళూరు నుంచి బోర్డు తిప్పేసి పూణేకు పారిపోయారు. పైగా చిత్తూరు, తిరుపతి జిల్లాలోని 25 మందికి పైగా నిరుద్యోగుల నుంచి దాదాపు రూ.70 లక్షలు వసూలుచేసి పారిపోయినట్లు తేలింది. వీళ్ల కోసం గాలిస్తుండగా చిత్తూరు సమీపంలో తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం





ఏనుగులు తొక్కేసిన వరిపైరు, విరిచేసిన అరటి చెట్లను చూపుతున్న బాధిత రైతు

సోమల:మండలంలోని అన్నెమ్మగారిపల్లెలో పంట పొలాలను గురువారం రాత్రి నాలుగు ఏనుగులు ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన జయప్రకాష్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు అనే రైతుల వరిపైర్లను తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల సంచారంతో పేటూరు, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె పంచాయతీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ అధికారులు వెంటనే స్పందించి ఏనుగులను అడవిలోకి మళ్లించాలని కోరుతున్నారు.

కీరమందలో..

బంగారుపాళెం: మండలంలోని కీరమంద గ్రామంలో గురువారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసి పొలాలను ధ్వంసం చేశాయి. రైతు సుబ్రమణ్యం పొలంలోని అరటి, మామిడి చెట్లను విరిచేశాయి. ఏనుగులు సంచారాన్ని కట్టడి చేసేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కౌంటింగ్.. ట్రైనింగ్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసేశారు. ఇక కౌంటింగ్‌ను పక్కాగా పూర్తి చేసేందుకు సన్నాహాలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం కౌంటింగ్ పర్సనల్స్‌కు ఓట్ల లెక్కింపుపై ప్రత్యేక శిక్షణ అందించారు. మొత్తం ప్రక్రియపై స్పష్టంగా అవగాహన కల్పించారు. నిష్పక్షపాతంగా.. పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. శిక్షణ కార్యక్రమాలను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి పర్యవేక్షించారు. - చిత్తూరు కలెక్టరేట్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్



బ్యాలెట్ పేపర్ల పరిశీలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఓట్ల లెక్కింపు విధానాలను వివరిస్తున్న జేసీ వెంకటేశ్వర్





ప్రాధాన్యత ఓట్లను గుర్తింపుపై శిక్షణ